సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శుక్రవారం। 11 । ఆగస్టు। 2023



చోరీ కేసులో నిందితుడి అరెస్టు

ఇందుకూరుపేటలో జరిగిన బంగారు నగల చోరీ కేసును పోలీసులు ఛేదించారు. నిందితుడిని అరెస్టు చేశారు. 8లో



'మణిపూర్' దోషులను శిక్షించాలి

మణిపూర్ ఘటనల్లో దోషులను శిక్షించాలని ఆదివాసీ మహిళ మహా సంఘ భారత్ అధ్యక్షురాలు మమత కుజూర్ డిమాండ్ చేశారు. 8లో



భద్రతకు పటిష్ట చర్యలు

రైల్వే ప్రయాణికులు సరక్షిత ప్రయాణం సాగించేలా చర్యలు తీసుకుంటున్నామని డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ తెలిపారు. 8లో

న్యూస్‌రీల్

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సాక్షి,పాడేరు: జి.మాడుగుల, కిండంగి, పాడేరులోని 33/కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ లైన్ నిర్వహణ పనుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ పంపిణీ సంస్థ పాడేరు ఈఈ ఎ.వి.ఎస్.ఎం.అప్పారావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పాడేరు, కిండంగి, జి.మాడుగుల సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు అదేరోజు ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఆయన తెలిపారు. వినియోగదారులు సమస్యను గుర్తించి సహకరించాలని ఆయన కోరారు.

వైఎస్సార్‌సీపీ 'పాడేరు' పరిశీలకుడిగా ఫరూఖీ



ఫరూఖీని సత్కరిస్తున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి తదితరులు

సాక్షి,పాడేరు: వైఎస్సార్‌సీపీ పాడేరు నియోజకవర్గ పార్టీ పరిశీలకుడిగా విశాఖ నగరానికి చెందిన ఐహెచ్ ఫరూఖీని పార్టీ కేంద్ర కమిటీ నియమించింది. గతంలో పాడేరు పరిశీలకుడిగా పనిచేసిన చొక్కాకుల వెంకట్రావు చోడవరం పరిశీలకుడిగా నియమితులయ్యారు. ఆయన స్థానంలో ఫరూఖీ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన గురువారం పాడేరులో పర్యటించారు. సలుగు పంచాయతీలోని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మితో పాటు ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనను ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, పార్టీ శ్రేణులు సత్కరించారు.

పండ్ల మొక్కల పెంపకంతో ఆర్థికాభివృద్ధి

- ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి



మొక్కలు నాటుతున్న రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి తదితరులు

గంగవరం: మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ, ఆర్థికాభివృద్ధిని సాధించవచ్చని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. టేకులవీధి గడియం సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో వివిధ రకాల పండ్ల మొక్కలను ఆమెతోపాటు ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ బేబీ రత్నం, ఎంపీడీవో శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ గంగాదేవి, సర్పంచ్‌లు కామరాజు, రమణమ్మ, లీలావతి, సుబ్బలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు నాటారు. పాఠశాలలో సౌకర్యాలను ఎమ్మెల్యే ధనలక్ష్మి విద్యార్థుల నుంచి తెలుసుకున్నారు. సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పాఠశాల ఆవరణలో నాటిన మొక్కలను సంరక్షించాలని సూచించారు.హెచ్ఎం బి.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

సకాలంలో ఇంజినీరింగ్ పనులు పూర్తి చేయండి

- ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే ఆదేశం



సమీక్షిస్తున్న పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం: ఏజెన్సీలో ఇంజనీరింగ్ పనులు వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే ఆదేశించారు. పీవో తన చాంబర్‌లో గురువారం గిరిజన సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్ శాఖ ఇంజనీర్లతో గ్రామ సచివాలయాలు. రైతు భరోసా కేంద్రాలు. హెల్త్ వెల్ సెంటర్ల పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంపచోడవరం ఐటీడీఏ పరిధిలోని ఏడు మండలాల్లో గ్రామ సచివాలయాలు. రైతు భరోసా కేంద్రాలు. హెల్త్ వెల్ సెంటర్ల నిర్మాణాలపై వివరాలు తెలుసుకున్నారు. ఏడు మండలాల్లో వివిధ ప్రభుత్వ పాఠశాలలో నాడు నేడు పనులపై సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఈ జి.డేవిడ్‌రాజ్, సత్యనారాయణ, డిప్యూటీ డీఈలు గౌతమి, చైతన్య, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా ఖరీఫ్

- జోరందుకున్న వరి నాట్లు
- నెలాఖరకు పూర్తయ్యే అవకాశం



నారుమడిని పరిశీలిస్తున్న అధికారులు



పాడేరు మండలం జి.ముంచంగిపుట్టు ప్రాంతంలో వరి నాట్లలో నిమగ్నమైన గిరి రైతులు

సాక్షి, పాడేరు: జిల్లాలోని ఖరీఫ్ వ్యవసాయ పనులు ఆశాజనకంగా ఉన్నాయి. పాడేరు డివిజన్‌లో ఇప్పటికే 50శాతం మేర నాట్లు పూర్తయ్యాయి. రంపచోడవరం డివిజన్‌లో రైతులు దమ్ము, నాట్లలో నిమగ్నమయ్యారు. చింతూరు డివిజన్‌లో వరద ముంపు తగ్గడంతో రైతులంతా ఖరీఫ్ వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. చింతూరు డివిజన్‌లోని నాలుగు మండలాల్లో వరి నారుమడులు ఆశాజనకంగానే ఉన్నప్పటికీ మెట్ట ప్రాంతాల్లో నీటినిల్వలు తక్కువగా ఉన్నందున వరి దమ్ములకు ఆలస్యమవుతోంది.చింతూరు, ఎటపాక మండలాల్లోని వరద ప్రభావం లేని ప్రాంతాల్లో నాట్లు జరుగుతున్నాయి.

వేర్వేరు బృందాలుగా..

వ్యవసాయశాఖ అధికారులంతా వేర్వేరు బృందాలుగా ఏర్పడి చింతూరు, రంపచోడవరం డివిజన్ పరిధిలోని 11మండలాల్లో ఖరీఫ్ వ్యవసాయ పనులపై సమీక్షించారు. నెలాఖరుకు జిల్లావ్యాప్తంగా నాట్లు పూర్తయ్యే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు.

జిల్లాలోని రైతు భరోసా కేంద్రాల వ్యవసాయశాఖ అసిస్టెంట్లు రైతులకు అవసరమైన సూచనలు అందిస్తున్నారు.

23,606 హెక్టార్లలో..

జిల్లాలో 58,404 హెక్టార్లలో ఖరీఫ్ వరి విస్తీర్ణం కాగా ఇప్పటి వరకు 23,606 హెక్టార్లలో నాట్లు పూర్తయ్యాయి.పాడేరు మండలంలో 1950 హెక్టార్లు,పెదబయలులో 3700, డుంబ్రిగుడలో 2307, అరకులోయలో 2823, అనంతగిరిలో 1831, హుకుంపేటలో 3506, పాడేరులో 1187, జి.మాడుగులలో 2724, చింతపల్లిలో 800, గూడెంకొత్తవీధిలో 2130, కొయ్యూరులో 160, ఎటపాకలో 36, చింతూరులో 42, దేవీపట్నంలో 93, వై.రామవరంలో 6, అడ్డతీగలలో 45, రాజవొమ్మంగిలో 85, గంగవరంలో 181 హెక్టార్లలో మాత్రమే వరినాట్లు వేశారు.

అనుకూలంగా వాతావరణం



ఖరీఫ్ సాగుకు వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. చింతూరు డివిజన్ మినహా, పాడేరు,రంపచోడవరం ప్రాంతాల్లో పరిస్థితి మెరుగ్గానే ఉంది. పాడేరు డివిజన్‌లో లోతట్టు ప్రాంతాల్లో వరి నాట్లు పూర్తయ్యాయి. మెట్ట ప్రాంతాల్లో ఊపందుకున్నాయి.

– ఎస్‌బీఎస్ నందు, జిల్లా వ్యవసాయాధికారి, పాడేరు

నులి పురుగుల నివారణతో ఆరోగ్యం

కలెక్టర్ సుమిత్‌కుమార్



విద్యార్థులతో నులిపురుగు నివారణ మాత్రలను మింగిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి, పాడేరు: నులిపురుగుల నివారణతో ఆరోగ్యం మెరుగుపడుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవం పురస్కరించుకొని గురువారం స్థానిక లోచలిపుట్టు ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాలలో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడుపులోని నులిపురుగులు మనం తినే ఆహారాన్ని ఒంటికి పట్టనివ్వకుండా చేస్తాయన్నారు. విద్యార్థులందరూ తప్పనిసరిగా ఆల్బెండ్‌జోల్ మాత్రలు వేసుకుని సంపూర్ణ ఆరోగ్యం పొందాలని సూచించారు. అంతకుముందు ఆయన మాత్రలు నమిలి విద్యార్థులకు చూపించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జమాల్‌బాషా మాట్లాడుతూ రెండేళ్ల దాటిన వారు మాత్రను పూర్తిగా వేసుకోవాలని సూచించారు. జిల్లాలో 6,475 ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని 3,35,065 మంది 18 సంవత్సరాల లోపు విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీకి లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. వీరిలో ఇప్పటివరకు 3,508 మంది బడిబయట పిల్లలను, అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదుకాని 2,035 మంది పిల్లలను గుర్తించి ఆల్బెండ్‌జోల్ మాత్రల పంపిణీకి ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జీవీవి.ప్రసాద్, ఎల్ఎఫ్ఎల్‌హెచ్ఎం టి.రంగారావు, వసతిగృహ సంక్షేమాధికారి పి.చిట్టిబాబు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే స్వచ్ఛమైన గాలి

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



డుంబ్రిగుడ మండల పరిషత్ వద్ద మొక్కలు మొక్కలు నాటుతున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



నా మట్టి - నాదేశం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్గుణ

డుంబ్రిగుడ: మొక్కల పెంపకంతో స్వచ్ఛమైన గాలి సాధ్యమని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండల కేంద్రంలో గురువారం నాభూమి నా దేశం కార్యక్రమంలో భాగంగా ఆయన మొక్కలు నాటారు. కస్తూర్బా బాలికల,గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు థింసా నృత్యంతో అలరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బాక ఈశ్వరి, జెడ్పీటీసీ జానకమ్మ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ సోమేశ్వరి, సర్పంచ్‌లు వెంకటరావు, నాగేశ్వరరావు, సుబ్బారావు, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజా రమేష్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మెద్దు, మండల పార్టీ అధ్యక్షుడు శెట్టి గోపాల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సార్రు, ఎంపీటీసీలు గీత, మండల పార్టీ మహిళా అధ్యక్షురాలు శాంతి, ఎంపీడీవో ఉషారాణి, తహసీల్దార్ నాగమ్మ, ఏపీవో దొర్రబాబు, సీడీపీవో నీలిమ, ఏటీడబ్ల్యూవో మల్లికార్జునరావు పాల్గొన్నారు.

దేశంకోసం త్యాగం చేయాలి

అరకులోయ టౌన్: దేశంకోసం ప్రతీ ఒక్కరు త్యాగం చేయాలని అరకు ఎమ్మెల్యేచెట్టి పాల్గుణ అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ శెట్టి రోషిణి, ఎంపీపీ రంజపల్లి ఉషారాణి, ఎంపీటీసీలు ఎల్‌బీ భీమరాజు, చత్రుఘ్న, సర్పంచ్‌లు దాసుబాబు, రాధిక, పార్టీ అధ్యక్షుడు కొర్రా గాశి, ఐటీడీఏ ఏపీవోలు ప్రభాకర్, వెంకటేశ్వర్లు, తహసీల్దార్ వేణుగోపాలరావు, ఎంపీడీవోనగేష్, ఈఓపీఆర్‌డీ విజయ్ కుమార్, ఈవో రాజ్ కుమార్, ఏపీవో జగదీష్, ఏపీఎం అప్పయ్యమ్మ పాల్గొన్నారు.

ప్రాథమిక విద్య మరింత పటిష్టం

- ఐటీడీఏ పీవో అభిషేక్
- పాఠశాల భవనం ప్రారంభం



నర్సిపుట్టు ఎంపీపీ పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

ముంచంగిపుట్టు: ప్రాథమిక స్థాయిలో విద్యా వ్యవస్థ పటిష్టంగా ఉండేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ ఆదేశించారు. మండలంలోని సుజనకోట పంచాయితీ నర్సిపుట్టులో అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనం ఆయన చొరవతో పూర్తయింది. ఇందుకు రూ.2 లక్షలు ఐటీడీఏ, రూ.55 వేలు పంచాయతీ వెచ్చించారు. ఎట్టకేలకు పూర్తయిన ఈ భవనాన్ని విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో పీవో ప్రారంభించారు. కొంతసేపు విద్యార్థులతో ముచ్చటించారు. సర్పంచ్ రమేష్, ఎంపీటీసీ సుబ్బలక్ష్మి, గ్రామస్తులు,ఉపాధ్యాయులు పీవోను సత్కరించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి నెలా మండలంలో ఐదు బాలికల పాఠశాలలను సందర్శించి తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు తదితర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి ఫొటో తీసి పంపిస్తే నిధులు కేటాయించి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం తాల్లబుతోటలో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనాన్ని ఆయన పరిశీలించారు. విద్యార్థులను ఈ భవనంలో కూర్చోబెట్టవద్దని సూచించారు. భవన సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. వివిధ సమస్యలపై నర్సిపుట్టు, తాల్లబుతోట గ్రామాల గిరిజనుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డీడీ కొండలరావు, ఎంపీడీవో రమేష్, ఎంఈవో కృష్ణమూర్తి, సీడీపీవో వరహాలమ్మ, ట్రైబల్ వెల్ఫేర్ ఏఈ జబ్బార్, వైద్యాధికారి రమేష్, ఏటీడబ్ల్యూవో స్వర్ణలత, ఏపీవో సూరిబాబు, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

15 ఏళ్ల తర్వాత మహిళ ఆచూకీ లభ్యం



అదృశ్యం అయిన మహిళను కుటుంబీకులకు అప్పగిస్తున్న పోలీసులు

హుకుంపేట : సంతరి పంచాయతీ చిన్నబురుగు పుట్టు గ్రామానికి చెందిన కంబ సత్యవతి అనే గిరిజన మహిళకు అరకులోయ మండలం బొంపి గ్రామానికి చెందిన సత్యారావుతో వివాహమైంది. ఆమెకు ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. మతిస్థిమితం లేక 15 ఏళ్ల క్రితం రాజస్థాన్ వెళ్లిపోయిన సత్యవతి 15 ఏళ్లుగా యాచకురాలిగా తిరుగుతోంది. ఆమె తెలుగులో మాట్లాడుతుండడంతో పోలీసులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమెది విశాఖ జిల్లా మన్య ప్రాంతం అని తెలుసుకుని పోలీసుల సహకారంతో హుకుంపేట మండల పోలీసుస్టేషన్‌కు తీసుకువచ్చి గురువారం ఎస్ఐ సతీష్ ఆధ్వర్యంలో ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించారు.

డీఆర్ఎం తనిఖీలు



రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న డీఆర్ఎం

తాటిచెట్లపాలెం(విశాఖ): వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్(డీఆర్ఎం) సౌరభ్ ప్రసాద్ గురువారం డివిజన్ పరిధిలోని మెయిన్ లైన్‌లో గురువారం పర్యటించారు. విశాఖపట్నం–పలాస సెక్షన్ పరిధిలో పూండి నుంచి విశాఖ వరకు విండో ట్రయలింగ్ తనిఖీలు చేపట్టారు. ప్రయాణికుల భద్రత, సౌకర్యాలు, పరిశుభ్రత, నిర్వహణ అంశాలను పరిశీలించారు. విశాఖ రైల్వేస్టేషన్ నుంచి కొత్తవలస, చీపురుపల్లి, తిలారు, శ్రీకాకుళంరోడ్, నౌపడ వరకు ఈ తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా బ్రిడ్జిలు, లెవల్ క్రాసింగ్స్, మలుపుల్ని పరిశీలించారు. పర్యటనలో డీఆర్ఎంతో పాటు సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ జి.సునీల్‌కుమార్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గర్భిణి మృతి

- ఆమె ప్రాణం కాపాడేందుకు వలంటీర్ విశ్వప్రయత్నం
- డోలీలో మోసుకుని ఆస్పత్రికి తరలించినా దక్కని ఫలితం




దహన సంస్కారానికి వాగు దాటుతున్న గ్రామస్తులు

ముంచంగిపుట్టు: మండలంలోని లక్ష్మీపురం శివారు ఉబ్బెంగుల గ్రామానికి చెందిన గర్భిణి వంతాల బసంతి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. ఈమెకు పురిటి నొప్పులు రావడంతో గ్రామ వలంటీర్ సుబ్బారావు డోలీలో ఐదు కిలోమీటర్లు మోసుకుని వచ్చి అక్కడి నుంచి అంబులెన్సులో స్థానిక పీహెచ్‌సీకి తరలించడం తెలిసిందే. అక్కడి నుంచి ఆమెను పాడేరు జిల్లా ఆస్పత్రికి, విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. వారం రోజులుగా ఆమె వైద్యసేవలు పొందుతూ బుధవారం మృతి చెందింది. ఆమెను ప్రాణాపాయం నుంచి కాపాడేందుకు గ్రామ వలంటీర్ చేసిన ప్రయత్నానికి ఫలితం లేకుండా పోయింది. గురువారం ఆమెకు ఉబ్బెంగుల గ్రామంలో దహన సంస్కారాలు నిర్వహించారు. వాగును దాటేందుకు గ్రామస్తులు నానా ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉబ్బెంగుల వాగుపై వంతెన నిర్మించి, పూర్తి స్థాయిలో రోడ్డు సౌకర్యం కల్పించాలని సర్పంచ్ కె.త్రినాథ్, గ్రామస్తులు కోరుతున్నారు.

అర్థమయ్యే రీతిలో బోధించకుంటే ఎలా?

- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ఆగ్రహం
- ముంచంగిపుట్టు గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల–1 తనిఖీ



విద్యార్థులకు బోధిస్తున్న పీవో అభిషేక్

ముంచంగిపుట్టు: విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించకుంటే ఎలాగని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ప్రశ్నించారు. గురువారం స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల–1ను ఆయన తనిఖీ చేశారు. తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. వారి సామర్థ్యాన్ని ప్రశ్నల ద్వారా తెలుసుకున్నారు. విదార్థులకు లెక్కలు చెప్పమని సబ్జెక్ట్ ఉపాధ్యాయుడిని ఆయన ఆదేశించారు. సరిగ్గా ఆయన బోధించలేకపోవడంతో హెచ్ఎం లక్ష్మిపైన పీవో ఆగ్రహానికి గురయ్యారు. అనంతరం ఆయన లెక్కలు, ఇంగ్లీష్, సోషల్ పాఠాలను విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించారు. అంతకుముందు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల–1ను తనిఖీ చేశారు. ఇండియా మ్యాప్‌ను బోర్డుపై వేసి విద్యార్థులను ప్రశ్నించారు. వారు చక్కగా చెప్పడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులను పీవో అభినందించారు. స్టాక్ రూం, రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని హెచ్ఎం మాణిక్యాలరావుకు సూచించారు. అనంతరం లబ్బూరులో నిర్మాణ దశలో ఉన్న ఏకలవ్య పాఠశాల భవనాలను పరిశీలించారు.రెండు నెలల్లో ముంచంగిపుట్టు, డుంబ్రిగుడ,పెదబయలు ఏకలవ్య పాఠశాలలను ప్రారంభించనున్నామని, ఈలోగా పూర్తిచేయాలని పీవో ఆదేశించారు. గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ వై.కొండలరావు పాల్గొన్నారు.

మొక్క నాటిన పీవో : మండలంలోని కించాయిపుట్టులో గురువారం అధికారులు నా భూమి–నా దేశం కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐటీడీఏ పీవో అభిషేక్ ప్రతిజ్ఞ చేయించి మొక్క నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు నా భూమి–నా దేశం కార్యక్రమం ఈ నెల 16వ తేదీ వరకు నిర్వహించాలని సూచించారు. దేశం కోసం పోరాడిన అమరులను స్మరించుకోవాలని, వారి త్యాగాలను గుర్తు చేసుకోవాలని కోరారు.అల్లూరి జిల్లా నుంచి 120 మందికిపైగా స్వాతంత్రం కోసం పోరాడిన గిరిజనుల పేర్లను సేకరించి, శిలాఫలకాలపై రాసి అందరికీ తెలియజేస్తామని పీవో పేర్కొన్నారు.

సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు నామినేషన్ల వెల్లువ



కొయ్యూరులో రిటర్నింగ్ అధికారికి నామినేషన్లు అందజేస్తున్న అభ్యర్థులు



నామినేషన్ అందజేస్తున్న కిల్లో జమున



హుకుంపేటలో నామినేషన్ దాఖలు చేస్తున్న సర్పంచ్ అభ్యర్థి చిన్నారావు



పెదకోడాపల్లి సర్పంచ్ స్థానానికి నామినేషన్ స్వీకరిస్తున్న ఎన్నికల అధికారి కృష్ణమూర్తి

కొయ్యూరు: మండలంలోని పెదమాకవరం, రేవళ్లు, నడింపాలెం పంచాయతీల్లో వార్డు సభ్యుల స్థానాలకు జరిగే ఎన్నికలకు ఏడు నామినేషన్లు స్వీకరించినట్టు రిటర్నింగ్ అధికారి, మండల పరిషత్ ఏవో బాలమురళీకృష్ణ తెలిపారు. రేవళ్లు నుంచి మూడు, నడింపాలెం, పెదమాకవరం నుంచి రెండేసి చొప్పున నామినేషన్లు వచ్చాయన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు జల్లి బాబులు, పార్టీ సీనియర్ నాయకులు గాడి సత్యనారాయణ, పాటి శేఖర్, గోకిరి చిన్నారావు, లింగేటి సుబ్రమణ్యం పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: మండలంలోని కొల్లాపుట్టు పంచాయతీలో రెండ వార్డు మెంబరు స్థానానికి వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో కిల్లో జమున గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఎంపీపీ బాక ఈశ్వరి, జెడ్పీటీసీ జానకమ్మ, సర్పంచ్ రామ్మూర్తి, సర్పంచ్ వెంకటరావు, మండల పార్టీ అధ్యక్షుడు శెట్టి గోపాల్ పాల్గొన్నారు.

హుకుంపేట: మండలంలోని శోభకోట సర్పంచ్ ఎన్నికకు సంబంధించి గురువారం ఐదు నామినేషన్ల దాఖలు అయ్యాయని రిటర్నింగ్ అధికారి శెట్టి సంజీవరావు తెలిపారు. ఓల్డా, మఠం, బారమసి వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్లు దాఖలు అయ్యాయి. వైఎస్సార్‌సీపీకి చెందిన సర్పంచ్ సిదేరి సాంబ పాల్గొన్నారు.

పెదబయలు: మండలంలోని పెదకోడాపల్లి సర్పంచ్ ఎన్నికకు సంబంధించి ఎనిమిది నామినేషన్లు దాఖలయ్యాయని స్టేజ్–1 ఎన్నికల అధికారి కొమ్ము కృష్ణమూర్తి తెలిపారు. మండలంలోని ఇంజరి పంచాయతీలో 8 వార్డులకు గాను 11 మంది నామినేషన్లు దాఖలు చేశారని ఆయన పేర్కొన్నారు. నామినేషన్లు వేసిన అభ్యర్థులు, ప్రతిపాదించిన అభ్యర్థులు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో హాజరు కావాలని సూచించారు. ఇంజరి స్టేజ్–1 అధికారి నర్సింగరావు పాల్గొన్నారు.

చింతూరు: మండలంలో ఖాళీగా ఉన్న మూడు వార్డు సభ్యుల స్థానాలకు సంబంధించి గురువారం రెండేసి చొప్పున ఆరు నామినేషన్లు దాఖలైనట్లు ఎంపీడీవో వెంకటరత్నం తెలిపారు. తుమ్మల పంచాయతీలోని ఆరో వార్డుకు రవ్వ మంగయ్య, కొవ్వాసి బాబూరావు, గూడూరు పంచాయతీలోని ఐదో వార్డుకు సోడె సూరయ్య, కరణం ముత్తయ్య, కొత్తపల్లి పంచాయతీలోని ఒకటో వార్డుకు కారం సుబ్బమ్మ, సోడె రాములమ్మ నామినేషన్లు దాఖలు చేసినట్లు ఆయన తెలిపారు.

రాజవొమ్మంగి: మండలంలోని లోదొడ్డి పంచాయతీలో 6వ వార్డు మెంబర్ ఎన్నికకు గురువారం ఆరు నామినేషన్లు వచ్చినట్టు రిటర్నింగ్ అధికారి, ఎంఈవో తాతబ్బాయి దొర చెప్పారు.

ఐఎన్ఎస్ విశ్వకర్మలో ముగిసిన అప్రంటీస్ శిక్షణ



గోల్డ్ మెడల్ అందుకుంటున్న సెయిలర్

సింధియా: ఐఎన్ఎస్ విశ్వకర్మలో కోస్టుగార్డు, హల్ ఆర్టిఫైసర్ అప్రంటీస్ శిక్షణ విజయవంతంగా ముగిసింది. సెయిలర్ ట్రైనీలుగా 41 మంది, కోస్టుగార్డు శిక్షణ ఐదుగురు పొందారు. గురువారం వీరికి కోర్సు కంప్లీషన్ పెరేడ్‌ను ఎస్ఎమ్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ రియర్ అడ్మిరల్ ఆర్.ఎస్.థాలివాల్ సమీక్షించారు. నౌకాదళ ప్లాట్‌ఫామ్‌లలో అమర్చిన వివిధ హల్ పరికరాల నిర్వహణ అప్రెంటీస్ శిక్షణను పూర్తి చేయడంతోపాటు, అగ్నివీర్ హైజనిస్ట్ విధుల్లో అవగాహన కల్పించారు. ఈ జట్లలో దీపక్‌కుమార్ మెరిట్‌లో నిలిచి, గోల్డ్ మెడల్ సాధించాడు. అభిజిత్, టి.వనిత పురుషులు, మహిళల విభాగాల్లో ఆర్డర్ ఆప్ మెరిట్‌లో ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్స్ పొందినట్టు అధికారులు పేర్కొన్నారు.

క్లుప్తంగా

దాతల తోడ్పాటుతో మరింత విద్యాభివృద్ధి

ఆర్‌జేడీ జ్యోతికుమారి




విద్యార్థులకు వైట్ షూస్ అందజేస్తున్న ఆర్జేడీ జ్యోతికుమారి

నర్సీపట్నం: విద్యాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకురాలు (ఆర్జేడీ) ఎం.జ్యోతికుమారి పేర్కొన్నారు. నర్సీపట్నం మున్సిపాలిటీ, వెంకునాయుడుపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను గురువారం ఆమె సందర్శించారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.గోపినాథ్, పూర్వవిద్యార్థులు సమకూర్చిన రూ.20 వేల విలువైన వైట్ షూలను 80 మంది విద్యార్థులకు ఆమె అందజేశారు. ప్రభుత్వం పాఠశాలలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంతోపాటు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించిందన్నారు. ప్రభుత్వ కృషికి దాతలు తోడ్పాటును అందిస్తే విద్యార్థులకు మరింత ప్రయోజనం చేకూరుతుందన్నారు. నాడు–నేడు పనుల పట్ల ఆర్జేడీ సంతృప్తి వ్యక్తం చేశారు.

22 కిలోల గంజాయి పట్టివేత

ఇద్దరు యువకుల అరెస్ట్



వివరాలు తెలియజేస్తున్న ఎస్‌ఐ రామకృష్ణ

కె.కోటపాడు: మండలంలో పోతనవలస కూడలి వద్ద స్కూటీపై తరలిస్తున్న గంజాయిని ఎ.కోడూరు ఎస్‌ఐ బి.రామకృష్ణ గురువారం స్వాధీనం చేసుకున్నారు. ఇక్కడ వాహన తనిఖీల్లో భాగంగా స్కూటీపై సంచితో అనుమానంగా ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులను ఆపి తనిఖీ చేయగా 22 కిలోల గంజాయి పట్టుబడింది. గంజాయిని తరలిస్తున్న విశాఖపట్నంకు చెందిన ఎన్.శివనాయుడు, సిహెచ్.పోతన రాకేష్‌లను అరెస్టు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

నులిపురుగుల నివారణతోనే చిన్నారుల్లో ఆరోగ్యం



విద్యార్థికి నులిపురుగు మాత్ర మింగిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్



చిన్నారులకు నులిపురుగుల మందు వేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



విద్యార్థులకు నులిపురుగులు మాత్రలను వేస్తున్న క్షయ నివారణ అధికారి డాక్టర్ విశ్వేశ్వరనాయుడు

ముంచంగిపుట్టు: నులిపురుగుల నివారణతోనే చిన్నారులు ఆరోగ్యవంతులుగా ఉంటారని పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ అన్నారు. మండలంలోని సుజనకోట పంచాయతీ నర్సిపుట్టు ఎంపీపీ పాఠశాలలో కిలగాడ వైద్యాధికారి రమేష్ ఆధ్వర్యంలో గురువారం నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఐటీడీఏ పీవో వి.అభిషేక్ విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలు వేశారు. నులిపురుగు వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పివో అభిషేక్ మాట్లాడుతూ పిల్లల్లో నులిపురుగు నివారణకు అల్బెండజోల్ మాత్రలను అందజేస్తున్నామన్నారు. పీచు పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని, నులిపురుగులు నివరించడం వల్ల పిల్లల్లో ఎదుగుదల పెరుగుతూ ఆరోగ్య వంతంగా ఉంటారన్నారు.గిరిజన సంక్షేమశాఖ డిడి కొండలరావు,సర్పంచ్ రమేష్, ఎంపీటీసీ సుబ్బలక్ష్మీ, ఎంపీడీవో రమేష్, వైద్య సిబ్బంది సుబ్రమణ్యం,అశోక్,లలిత,సుశీల తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ: అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

డుంబ్రిగుడ: చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. ప్రపంచ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గుణ చేతుల మీదుగా పిల్లలకు నులిపురుగు నివారణ మందును వేశారు. వైద్యాధికారి ప్రేమ, ఐసీడీఎస్ సీడీపీవో నీలిమ, ఎంపీపీ బాక ఈశ్వరి, జెడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణే లక్ష్యం

నులిపురుగుల నివారణమే లక్ష్యంగా ప్రతి విద్యార్థికి మందులు వేస్తున్నామని క్షయ నివారణాధికారి డాక్టర్ కె.విశ్వేశ్వరనాయుడు చెప్పారు. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగు నివారణ మందులను వేశారు.

హత్య కేసులో నిందితుడి లొంగుబాటు



విలేకరులతో మాట్లాడుతున్న సీఐ రుద్ర శేఖర్, నిందితుడితో పోలీసు సిబ్బంది

అరకులోయటౌన్ : డుంబ్రిగుడ మండలంలోని గసభ పంచాయతీ, గొందిగుడ గ్రామంలో ఈనెల 7వ తేదీ సోమవారం జరిగిన హత్య కేసులో నిందితుడు పాంగి సనామ (68) గురువారం అరకులోయ సీఐ రుద్రశేఖర్ ఎదుట లొంగిపోయాడు. సీఐ రుద్రశేఖర్ విలేకరులకు అందించిన వివరాలివి. సనామ తన భార్యతో నిత్యం గొడవలు పడేవాడు. వరుసకు తమ్ముడైన సనాతో పాటు సనా భార్య ఎందుకు గొడవలు పడుతుంటారని సనామను వారించారు. అదేవిధంగా ఆదివారం సనామ తన భార్యతో గొడవ పడి కత్తితో నరకబోతే వారు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో సనామ భార్య పుట్టింటికి వెళ్లిపోవడంతో దీనికి కారణం సనా అని కక్ష పెట్టుకున్నాడు. సోమవారం సనామ గొడ్డలి పట్టుకొని సనా ఇంటికి వెళ్లి వారి తలుపులు, కిటికీలు బద్దలు కొట్టాడు. వ్యవసాయ పనులకు వెళ్లి వచ్చిన సనా ఎందుకు తలుపులు, కిటికీలు ఇలా చేశావని సనామను ప్రశ్నించడంతో వెంటనే సనామా తన వద్ద నున్న గొడ్డలితో సనా మెడపై నరికి చంపాడు. అనంతరం గసభ వీఆర్వో బి.బి.ప్రసాదరావు సమక్షంలో లొంగిపోయేందుకు సిద్ధపడగా నిందితుడిని తమ వద్దకు తీసుకువచ్చి అప్పగించారని సీఐ తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించామన్నారు. విలేకరుల సమావేశంలో డుంబ్రిగుడ ఎస్‌ఐ సంతోష్ కుమార్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపై విగతజీవిగా కొడుకు...ఏమైందో తెలియక తండ్రి...



మృతుడు అభిషేక్



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ సంతోష్

- యండపల్లివలస వద్ద యువకుడి దుర్మరణం
- కంటతడి పెట్టించిన తండ్రి ఆక్రందన

అరకులోయ టౌన్ : అరకులోయ మండలంలోని పద్మాపురం పంచాయతీ యండపల్లివలస ప్రధాన రహదారి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలివి. యండపల్లివలసలోని టీచర్స్ కాలనీకి చెందిన ఎల్.బి.అభిషేక్(20) అరకులోయ నుంచి యండపల్లివలస ద్విచక్ర వాహనంపై వెళ్తూ ఉండగా వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. ఈ సంఘటనలో అభిషేక్ అక్కడికక్కడే మృతి చెందాడు. అభిషేక్ విజయనగరం జిల్లా రాజాంలోని ఇంజినీరింగ్ కళాశాలలో మూడో సంవత్సరం కంప్యూటర్ విద్య అభ్యసిస్తున్నాడు. విషయం తెలుసుకున్న అరకులోయ ఎస్‌ఐ ఆర్.సంతోష్ ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితి సమీక్షించి, మృతదేహన్ని స్థానికుల సహాయంతో 108లో ఎక్కించి, అరకు ఏరియా ఆస్పత్రి తరలించారు.

ఏమైంది..నాన్నా...!

మండల కేంద్రంలోని జెడ్పీ కాలనీకి చెందిన ఎల్.బి. చంద్రశేఖర్ కుటుంబం యండపల్లివలసలోని టీచర్స్ కాలనీలో నివాసం ఉంటోంది. తన బిడ్డ అభిషేక్‌కు రోడ్డు ప్రమాదం జరిగిందని తెలుసుకున్న తండ్రి చంద్రశేఖర్ ఘటన స్థలానికి చేరుకొని విగత జీవిగా పడి ఉన్న తన కుమారుడిని చూసి, మృతి చెందినట్టు తెలియక 'ఏమైంది నాన్న... ఎలా జరిగింది ఈ ప్రమాదం...ఎక్కడ దెబ్బలు తగిలాయి...' అంటూ భోరున విలపించాడు. నీ కుమారుడు చనిపోయాడని అక్కడే ఉన్న స్థానికులు చెప్పడంతో దిగ్భ్రాంతికి గురై ఏం చేయాలో తెలియని పరిస్థితిలో అటు ఇటూ తిరుగుతూ పిచ్చివాడిలా ఫోన్లు చేస్తూ రోధించడం చూపరులను కంటతడి పెట్టించింది. మృతుడి తండ్రి వృత్తి రీత్యా ఉపాధ్యాయుడు, తల్లి నర్సుగా పనిచేస్తున్నారు. వీరికి అభిషేక్‌తో పాటు మరో అమ్మాయి సంతానం.

మణిపూర్ ఘటనలో దోషులను శిక్షించాలి



వనవిహారి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

అరకులోయటౌన్: మణిపూర్‌లో ఆదివాసీ మహిళలపై జరిగిన సంఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని ఆదివాసీ మహిళ మహాసంఘ భారత్ అధ్యక్షురాలు మమత కుజార్ డిమాండ్ చేశారు. స్థానిక గిరిజన మ్యూజియం ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. మణిపూర్‌లో ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి చర్యలు చేపట్టాలని కోరుతూ గిరిజన ఎంపీలకు వినతిపత్రం అందజేసినట్టు చెప్పారు. గిరిజన ప్రాంతంలో సంస్కృతి సంప్రదాయాలు, 5, 6 షెడ్యూల్ అమలు చేయాలన్నారు. 2030 నాటికి భారత దేశంలో సుస్థిర విధానం కావాలన్నారు. భారతీయ ఆదివాసీ సంఘాల సమైక్య ఆల్ ఇండియా చీఫ్ ప్రెసిడెంట్ మీనక సింహాచలం మాట్లాడుతూ బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడం వల్ల నష్టం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. పీసా చట్టం పక్కగా అమలు చేయాలన్నారు. అనంతరం మీనక సింహాచలం రచించిన వనవిహారి పుస్తకాన్ని విడుదల చేశారు. గుంట దేవి, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో గిరిజనులపై దాడులకు నిరసనగా శాంతి ర్యాలీ

జి.మాడుగుల: మణిపూర్‌లో జరిగిన హింసాకాండకు నిరసనగా మండల కేంద్రంలో గురువారం శాంతి ర్యాలీ నిర్వహించారు. పాస్టర్లు, ముస్లింలు, ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు, గిరిజనులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. భారీ ర్యాలీ నిర్వహించారు. మండల పాస్టర్స్ ఫెలోషిప్–సెంట్రల్ ప్రేయర్ ఫెలోషిప్ నాయకులు ప్రభాకర్, డేవిడ్‌రాజు, వి.తిమోతి ఆధ్వర్యంలో సేవ్ మణిపూర్ అంటూ నినాదాలు చేశారు. వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, జెడ్పీటీసీ డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి, ఎంపీపీ కె.పద్మ, పాస్టర్లు ప్రభాకర్, డేవిడ్‌రాజు, ఈసక్ మాట్లాడుతూ మణిపూర్‌లో శాంతి వాతావరణం నెలకొల్పేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. ఘటనలో దోషులను గుర్తించి కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సర్పంచ్‌లు రామకృష్ణ, రాంబాబు, కొండబాబు, నాయకులు కోటేశ్వరరావు, పాస్టర్లు తదితరలు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

- రూ. 10 లక్షల విలువైన బంగారం స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఏఎస్పీ జగదీష్

రంపచోడవరం : దేవీపట్నం మండలం ఇందుకూరుపేటలో జరిగిన బంగారు నగల చోరీ కేసును పోలీసులు ఛేదించారు. నిందితుడిని అరెస్టు చేసి బంగారం స్వాధీనం చేసుకున్నారు. వివరాలను రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహళ్లి గురువారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఇందుకూరుపేట గ్రామానికి చెందిన మేడపాటి సత్యనారాయణ ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు ఇంటి వెనుక వైపు ఉన్న తలుపు గొళ్లెం తొలగించి ఇంట్లో ప్రవేశించారు. బీరువాలో దాచుకున్న మంగళ సూత్రం 48.727 గ్రాములు, చంద్రహారం 24.247 గ్రాములు, 6 గాజులు 65.306 గ్రాములు, నల్లపూసలు దండ 23.955 గ్రాములు, హారం 43.610 గ్రాములు, మాటీలు 3.182 గ్రాములు మొత్తం 209.027 గ్రాముల వరకు గల బంగారు నగలు అపహరించినట్టు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై దర్యాప్తు జరిపి నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా తాను చెడు అలవాట్లకు లోనై జల్సాగా తిరగడం కోసం నగలు దొంగిలించినట్టు నిందితుడు తెలిపాడన్నారు. అతడి వద్ద నుంచి చోరీ సొత్తు మొత్తం స్వాధీనం చేసుకున్నామన్నారు. వాటి విలువ సుమారు రూ.10 లక్షలు ఉంటుందన్నారు. సమావేశంలో ఎస్‌ఐ నాగార్జున, సిబ్బంది పాల్గొన్నారు.

బహిర్భూమికి వెళ్లి యువకుడి మృతి

పాయకరావుపేట: మండలంలో నామవరం గ్రామానికి చెందిన గొర్ల వెంకటరమణ (37) బహిర్భూమికి వెళ్లి మృతి చెందినట్లు ఏఎస్‌ఐ గోవిందరావు గురువారం తెలిపారు. అతడు తాపీ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడని, బుధవారం ఉదయం గ్రామ సమీపాన బహిర్భూమికి వెళ్లి తిరిగి రాలేదన్నారు. దాంతో భార్య నూకరత్నం వెతకగా చాకలిరేవు వద్ద బహిర్భూమిలో చనిపోయినట్లు ఆమె ఫిర్యాదు చేసిందన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

అచ్యుతాపురం (అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని హరిపాలెంకు చెందిన అనంతరావు గురువారం పొలాల్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంటి నుంచి పొలానికి వెళ్లిన అతడు ఎంతకీ తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబీకులు అక్కడకు వెళ్లి పరిశీలించగా, అపస్మారక స్థితిలో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే ఆస్పత్రికి తరలించినప్పటికీ ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయింది.

అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించడంతో ఆయన కుటుంబీకులు కన్నీటి పర్యంతమయ్యారు. అప్పుల బాధ భరించలేకే తన తండ్రి ఆత్మహత్యకు పాల్పడ్డారని కుమారుడు బాలాజీ వాపోయాడు. అతడి ఫిర్యాదు మేరకు సీఆర్పీ 174 కింద కేసు నమోదు చేసినట్లు స్థానిక పోలీసులు తెలిపారు.

రైల్వే ప్రయాణికుల భద్రతకు పటిష్ట చర్యలు

- ప్రమాదాల నివారణలో ప్రసార మాధ్యమాల పాత్ర కీలకం– డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సివిల్ డిఫెన్స్ సభ్యులు

తాటిచెట్లపాలెం(విశాఖ): రైల్వేలో సురక్షిత ప్రయాణం, ప్రమాదాల నివారణలో ప్రసార మాధ్యమాల పాత్ర కీలకమని వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్(డీఆర్‌ఎం) సౌరభ్ ప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులకు భద్రతా విషయాలలో అవగాహన కల్పిస్తూ, సురక్షిత ప్రయాణం సాగించేలా వాల్తేర్ డివిజన్ అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. ఇందుకు డివిజన్ పరిధిలో డివిజనల్ కల్చరల్ అసోసియేషన్ సహకారంతో ప్రత్యేక డ్రైవ్‌లను, అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రయాణికులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించేందుకు సీనియర్ డివిజనల్ సేఫ్టీ ఆఫీసర్ మోనిష్ బ్రహ్మ నేతృత్వంలో సివిల్ డిఫెన్స్ సిబ్బందితో కూడా భద్రతా విభాగం కృషి చేస్తోందన్నారు. అనవసరంగా చెయిన్ లాగడం, ఫుట్‌బోర్డు ప్రయాణాలు, రైల్వే ట్రాక్‌లను దాటడం, రైల్వే ట్రాక్‌లపై బహిరంగ మలవిసర్జన వంటివి చేయరాదని, ఇవి నేరాల కిందకు వస్తాయని వీధి ప్రదర్శనలు, నాటికల ద్వారా ప్రజలకు వివరిస్తున్నట్లు పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని రైల్వేస్టేషన్లు, బహిరంగ ప్రదేశాలు, స్కూళ్లు, కాలేజీలు, లెవల్ క్రాసింగ్ గేట్లు, ట్రాక్‌ల పరిసర ప్రాంత ప్రజలకు స్కౌట్స్ అండ్ గైడ్స్, సివిల్ డిఫెన్స్, మీడియా, సోషల్ మీడియా సహకారంతో అవగాహన కార్యక్రమాలను విరివిగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

లేగదూడల పెంపకంలో ప్రత్యేక శ్రద్ధ



ప్రదర్శనలో బహుమతులు పొందిన లేగదూడలు

చోడవరం రూరల్: రైతులు లేగదూడల పెంపకంలో శ్రద్ధ చూపాలని, దానికి తగినన్ని తల్లిపాలు అందించాలని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ అధికారి రామ్‌మోహన్‌రావు తెలిపారు. లేగదూడల ఉత్పత్తి పథకంలో భాగంగా మండలంలోని ఖండేపల్లిలో గురువారం రైతులకు లేగదూడల సంరక్షణ పట్ల అవగాహన కల్పించారు. జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి ప్రసాదరావు, డిప్యూటీ డైరెక్టర్ కరుణాకరరావు, అసిస్టెంట్ డైరెక్టర్ చిన్నంనాయుడులతో కలిసి రైతులకు పలు రకాల సూచనలు అందజేశారు. కార్యక్రమంలో భాగంగా లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. దీంట్లో మేలైన లేగదూడల యజమానులకు బహుమతులను మందులు, విటమిన్ టానిక్‌లను పంపిణీ చేశారు. పశువైద్యాధికారులు టి.ప్రశాంతకుమార్, బి.లక్ష్మీలిఖిత, ఎ.అచ్యుతరామ్, బుచ్చియ్యపేట మండల పశువైద్యాధికారులు ఎస్.శివకుమార్, బి.రాము, ఉమామహేశ్వరి, డీఎల్డీఏ డాక్టర్ బి.సంధ్య, డీఏహెచ్‌వో డాక్టర్ పి.భానుబాబు పాల్గొన్నారు.

పలు రైళ్ల దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్‌రైల్వే ఖుర్దారోడ్ డివిజన్, కటక్–కందర్పూర్ మధ్య నాన్‌ఇంటర్‌లాకింగ్ పనుల్లో భాగంగా జరుగుతున్న ఆటో సిగ్నలింగ్ పనుల నిమిత్తం ఈ మార్గంలో నడిచే పలు రైళ్ల దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. 14న టాటానగర్–విశాఖపట్నం(20815) ఎక్స్‌ప్రెస్ మళ్లించబడిన మార్గంలో వయా కిషన్‌గంజ్, సాలాగావ్, నారాజ్ మార్థపూర్, బారగడ్ రోడ్‌ల మీదుగా నడుస్తుంది. కిషన్‌గంజ్, నారాజ్ మార్తాపూర్‌లలో తాత్కాలిక హాల్ట్ కల్పించారు. 11న అగర్తలా–సికింద్రాబాద్ (07029) ఎక్స్‌ప్రెస్ మళ్లించబడిన మార్గంలో వయా కిషన్‌గంజ్, సాలాగావ్, నారాజ్ మార్థపూర్, బారగడ్ రోడ్‌ల మీదుగా నడుస్తుంది. కిషన్‌గంజ్, నారాజ్ మార్తాపూర్‌లలో తాత్కాలిక హాల్ట్ కల్పించారు.

సికింద్రాబాద్‌లో రైలెక్కి.. విశాఖలో అదృశ్యం



రోహన్(ఫైల్)

తాటిచెట్లపాలెం(విశాఖ): పాలిటెక్నిక్ పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయని తండ్రి మందలించడంతో హైదరాబాద్‌కు చెందిన బాలుడు ఇంట్లో చెప్పకుండా విశాఖపట్నం వచ్చేసి.. అదృశ్యమయ్యాడు. విశాఖపట్నం గవర్నమెంట్ రైల్వే పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాలివీ.. నేరేడ్‌మెట్(హైదరాబాద్)కు చెందిన గోవర్ధన్.. కుమారుడు కె.రోహన్ రాజు(17)ను మందలించడంతో సికింద్రాబాద్‌లో రైలెక్కి ఈ నెల 4న విశాఖపట్నంలో దిగాడు. ఇక్కడ నుంచి వేరే వారి సెల్‌ఫోన్ నుంచి తన ఫ్రెండ్‌కు ఫోన్ చేసి విశాఖ వచ్చినట్లు చెప్పాడు. అతను బాలుడి తండ్రి విషయం చెప్పాడు. వెంటనే రోహన్ కోసం కుటుంబ సభ్యులు గాలించారు. ఎంతకీ ఆచూకీ లభించకపోవడంతో గురువారం రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. రోహన్ ఇంటి నుంచి బయలు దేరినప్పుడు క్రీం కలర్ టీషర్ట్, డార్క్ బ్లూ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడని, చామన చాయ రంగు, సన్నగా ఉంటాడని తండ్రి గోవర్ధన్ తెలిపారు. బాలుడి ఆచూకీ తెలిసిన వారు గవర్నమెంట్ రైల్వేపోలీస్ స్టేషన్‌లో గానీ, సబ్ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాసరావుకు 98664 13487లో గానీ తెలియజేయవచ్చు.